క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బలోపేతానికి నిరంతర కృషి



గౌతమ్‌ను సత్కరించిన పార్టీ శ్రేణులు

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుర్రం గౌతం పేర్కొన్నారు. ఆదివారం గుర్రం గౌతమ్ అభిమానులు, పార్టీ శ్రేణులు ఆయన నివాసంలో సత్కరించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ సిఫారసుతో నియామకం పొందడం ఆనందదాయకమన్నారు. పార్టీ అధ్యక్షుడు ఆదేశాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుని పార్టీ శ్రేణులను కలుపుకుని ముందుకు వెళ్తానన్నారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు



శిబిరంలో రోగికి మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామం రమాదేవి గార్డెన్స్‌లో ఆదివారం కిమ్స్ బొల్లినేని హాస్పిటల్స్, లైన్స్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించాయి. ఈ శిబిరంలో 200 మందికి కిమ్స్ వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు వజ్రపు కోటేశ్వరరావు, గ్రంధి వెంకటేశ్వరరావు శిబిరం ఏర్పాటు చేసిన హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహన్, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్ ఎస్ రామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

పవిత్రోత్సవాలకు ఏర్పాట్లు



శ్రీగోవింద క్షేత్రంలో స్వామివారు

సీటీఆర్ఐ: లాలాచెరువు వద్ద గల శ్రీగోవింద క్షేత్రంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు శ్రీ పద్మావతీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి త్రయాహ్నిక ఏక కుండాత్మక వార్షిక పవిత్రోత్సవాలు జరుగుతాయని, అందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ ప్రధాన అర్చకుడు తోపురాణి శ్రీమన్నారాయణ ఆచార్యులు అన్నారు. 8వ తేదీ ఉదయం 8.30 గంటలకు యాగశాల ప్రవేశం, చతుస్థానార్చనలు, అగ్ని ప్రతిష్ఠ, నిత్య, ప్రాయశ్చిత్త హోమాలు, పూర్ణాహుతి, గోష్ఠి, సాయంత్రం 5గంటలకు శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ, నిత్యవిధి, గోష్ఠి, 9వ తేదీ ఉదయం, సాయంత్రం నిత్య హోమాలు, 10వ తేదీ ఉదయం 9.30 గంటలకు మహా పూర్ణాహుతి, పవిత్రాల విసర్జన, విశేష అలంకరణ, నివేదన కుంభప్రోక్షణ, మంగళాశాసనం, మహదాశీర్వచనం, పండిత సన్మానం, స్వస్తి జరుగుతాయన్నారు.

సినిమాలు



శ్యామల	: కిష్కింధపురి
సూర్యమినీ	: అవతార్, సన్నీ సంస్కారికి తులసీ కుమారి
సూర్యప్యాలెస్	: కాంతారా–1
స్వామి	: ఓజీ
అనుశ్రీ	: ఓజీ
శివజ్యోతి	: ఓజీ
రాజా	: ఓజీ
ఊర్వశి	: కాంతారా–1
మేనక	: ఇడ్లీకొట్టు
రంభ	: మిరాయ్
అప్సర	: కాంతారా–1
అశోక	: ఇడ్లీకొట్టు
నామవరం	
వీఎస్ మహల్	: మిరాయ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: కాంతారా–1, ఓజీ
కడియం	
వెంకట సూర్య	: ఓజీ



కోటి లింగాల ఘాట్‌లో క్యాప్సూల్స్ ఆకారంలో నిర్మాణం చేపట్టిన రెస్టారెంట్స్



వివిధ వ్యాపారాల కోసం నిర్మించిన 10 షాపులు

పవిత్రతే ప్రామాణికం

- కోటిలింగాల ఘాట్‌లో వేలానికి సిద్ధమైన షాపులు
- మాంసాహార విక్రయాలు లేకుండా చూడాలని జనం వినతి

రాజమహేంద్రవరం సిటీ: ప్రతిష్ఠాత్మకమైన స్థానిక కోటిలింగాల ఘాట్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన షాపులు ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తున్నాయి. సుమారు కోటి 90 లక్షల రూపాయలతో 10 షాపులు, 15 వెండింగ్ జోన్స్ నిర్మాణం చేపట్టారు. 10 షాపులతోపాటు పక్కనే బహిరంగంగా వ్యాపారాలు సాగించేందుకు మరో 15 జోన్స్ ఏర్పాటుకు సిద్ధమయ్యారు. మద్యం మినహా అన్ని రకాల అల్పాహారాలు, తినుబండారాలు, డ్రింక్స్ వ్యాపారాలు కొనసాగించేందుకు వీలుగా కోటిలింగాలు ఘాటు ప్రాంతాన్ని నగరపాలక సంస్థ అధికారులు సిద్ధం చేశారు. వీటితోపాటు రెండు క్యాప్సూల్స్ ఆకారంలో ఉన్న రెస్టారెంట్లను సైతం నిర్మాణం చేపట్టారు. సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టిన షాపులను తక్షణమే ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతిష్ఠాత్మకమైన కోటిలింగాల ఘాట్‌లో షాపుల వేలం నిర్వహించే సమయంలో మాంసాహారాలు ఏర్పాటు చేయకుండా నగరపాలక సంస్థ చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. నగరపాలక సంస్థ వేలం నిర్వహించినా ప్రతిష్ఠాత్మకమైన ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతున్న కోటిలింగాల ఘాట్లో మాంసాహారాన్ని విక్రయించే చర్యలను మానుకోవాలని హిందూ వాదులు విజ్ఞప్తి చేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు షాపులను వేలం వేసే ముందుగానే కేవలం శాఖాహారానికి సంబంధించిన షాపులు ఏర్పాటు చేస్తామని ప్రకటించాలని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. షాపులు వేలం నిర్వహించిన తర్వాత మాంసాహార విక్రయాలు జరపరాదని ఆంక్షలు విధించే కన్నా ముందుగానే కేవలం శాఖాహార విక్రయాలు మాత్రమే ఏర్పాటు చేయాలనే విషయాన్ని స్పష్టం చేసి వేలం నిర్వహించాలని కోరుతున్నారు.

ఘాట్ అభివృద్ధి అభినందనీయం



కోటిలింగాల ఘట్టం అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు అభినందనీయం. ఆధ్యాత్మికత వెల్లివిరిసే ఘాట్లో ఏ విధమైన మాంసాహార విక్రయాలు లేకుండా చర్యలు చేపట్టాలి. దేశంలోనే ప్రతిష్ఠాత్మకంగా ఉన్న ఘాట్లో రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు హిందూ ధర్మానికి ఏ విధమైన ఇబ్బందులు లేకుండా షాపుల వేలం నిర్వహించాలి.

– బి. శైలజ, రాజమహేంద్రవరం

పవిత్రతను భంగం కలగకుండా చూడాలి



కోటిలింగాల ఘాట్లో పవిత్రతకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి. మాంసాహార విక్రయాలతో అపవిత్రమైన పనులు చేపడితే హిందూ ధర్మానికే ద్రోహం చేసినట్టు అవుతుంది. అధికారులు భవిష్యత్తు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని షాపులను వేలం వేసే సమయంలో పటిష్టమైన నిర్ణయాలతో ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ప్రజల మనోభావాలు దెబ్బ తినకుండా చర్యలు చేపట్టాలి.

– లతా రెడ్డి, రాజమహేంద్రవరం

సేవలకు ప్రశంసలు



దివ్యాంగుడికి వీల్‌చైర్ అందిస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: 14 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతినెలా వృద్ధులకు వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ పింఛన్లు అందించి సేవకి ప్రతిరూపంగా నిలిచిందని ముఖ్య అతిథులు కొనియాడారు. ఆదివారం వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోని ఆనందా గార్డెన్స్‌లో వృద్ధులకు పింఛన్లు, దుప్పట్లు, దివ్యాంగులకు వీల్‌చైర్‌లు అందజేశారు. 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున అందచేశారు. చలపరెడ్డి రాజు కుమారుడు చలపరెడ్డి గీతా సాయి కుమార్ జ్ఞాపకార్థం దివ్యాంగుడుకి వీల్ చైర్ అందజేశారు. పి.సుష్మ తన తండ్రి జ్ఞాపకార్థం సత్యకీర్తి పేద విద్యార్థినికి రూ.5 వేలు అందజేశారు. కెవీవీఎస్ఎన్ మూర్తి రూ.6 వేలు, నల్లి నాగేశ్వర సత్యనారాయణ రూ.5 వేలు, పుచ్చెల సాయి జిగీష రూ.3 వేలు విద్యాభివృద్ధి కోసం క్లబ్‌కు అందచేశారు. క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు, తూతిక ప్రసాద్, చలపరెడ్డి రాజు, గుబ్బల గంగా భవాని పాల్గొన్నారు.

చిత్రకళకే వన్నెతెచ్చిన వెంకటరత్నం



ప్రఖ్యాత చిత్రకారుడు రామకృష్ణను సత్కరిస్తున్న బలరామ నాయుడు తదితరులు

సీటీఆర్ఐ: చిత్ర కళ ఆచార్యునిగా చిత్రకళకే వన్నె తెచ్చిన ఘనత వరద వెంకటరత్నంది అని ఆంధ్ర కేసరి యువజన సమితి పూర్వ అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు అన్నారు. ఎందరో ప్రఖ్యాత చిత్రకారులను తయారు చేసిన వరద వెంకటరత్నం 130వ జయంత్యుత్సవం దామెర్ల ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి చిత్ర జగతికి ఆయన చేసిన సేవల్ని పలువురు కొనియాడారు. దామెర్ల స్మారక చిత్రకళా పాఠశాల స్థాపించి 40 ఏళ్ల ఎన్నో సేవలు అందించిన వరద వెంకటరత్నం చిత్రకళకు ఆరాధ్యుడు అన్నారు. సిల్క్ వస్త్రాలపై పారదర్శక జల ప్రక్షాళన శైలిలో రంగులు వేయడంలో ఆయన ప్రత్యేకత ఉందని ఆంధ్ర కేసరి యువజన సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ రికార్డుల విజేత కేంద్రీయ విద్యాలయం చిత్రకళ ఆచార్యులు ఆత్మకూరు రామకృష్ణని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీవీఎస్ కృష్ణారావు, రఘుపాత్రుని సాయిబాబా, బెజవాడ రంగారావు, రచయిత రవికాంత్ పాల్గొన్నారు.

26న శెట్టిబలిజ వన మహోత్సవం



శెట్టిబలిజ వన భోజన మహోత్సవం ఆహ్వాన పత్రికను ప్రారంభిస్తున్న సంఘ నాయకులు

సీటీఆర్ఐ: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన శెట్టిబలిజ వన మహోత్సవం, రాష్ట్ర స్థాయిలో శెట్టిబలిజ వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు శెట్టిబలిజ సంక్షేమ సంఘ నాయకులు వెల్లడించారు. ఆదివారం స్థానిక సీతంపేట మూలగొయ్యిసెంటర్‌లో శెట్టిబలిజ వన భోజన మహోత్సవం ఆహ్వాన పత్రికను స్థానిక పెద్దలు శెట్టి సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘ నాయకులు సానబోయిన రామారావు మాట్లాడుతూ శెట్టిబలిజ సామాజికవర్గ అభివృద్ధికి ఎన్నో త్యాగాలు చేసిన పెద్దల పేరిట అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. పార్టీలకు అతీతంగా అందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు మట్టపర్తి సత్యనారాయణ, కార్యదర్శి బత్తిన ఏడుకొండలు, కోశాధికారి బొక్కా వెంకటప్రతాప్, పోలవరపు రాము, సింహం చిన్న, దూడల వెంకట విశ్వనాథ్ పాల్గొన్నారు.

మేకప్పచెరువులో చెత్త వేయకుండా చర్యలు చేపట్టండి

వైఎస్సార్ సీపీ నాయకుల డిమాండ్



మేకప్ప చెరువు వద్ద చెత్త వేయడంతో పరిస్థితిని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని మేకప్ప చెరువులో పంచాయతీ పారిశుధ్య సిబ్బంది సేకరించిన చెత్తను వేయకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మేకప్పచెరువును వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరిశివకుమార్, పార్టీ నాయకులు కుప్పాల రాంబాబు, కామిరెడ్డి పెద కాపు, బీదంరాజులు రజక సంఘ నేతలతో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతకాలంగా పంచాయతీలోని చెత్తను తీసుకువచ్చి మేకప్పచెరువులో తీసుకువచ్చి వేస్తున్నారన్నారు. దీనివలన రోడ్డుపై మురుగునీరు ప్రవహించడంతో పాటు, చెరువు మూసుకుపోయే పరిస్థితి నెలకొందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మేకప్పచెరువును వినియోగించుకునేవారన్నారు. కొంతకాలంగా మేకప్ప చెరువును ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారిందన్నారు. చెరువు వద్ద చెత్తవేయడం వలన పరిసర ప్రాంత ప్రజలకు రోగాలు వచ్చే ప్రమాదముందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మేకప్పచెరువులో ఎటువంటి చెత్తవేయకుండా చర్యలు చేపట్టడంతో పాటు, చెరువును పూర్తిస్థాయిలో బాగు చేయించాలని కోరతామని బొప్పన సుబ్బారావు తెలిపారు.

ఆరుగురు విద్యార్థులకు సహాయం

- ఆరుగురు విద్యార్థులకు స్వర్ణాంధ్ర రాంబాబు సహాయం
- ఆయన సేవలు ఆదర్శనీయం : విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ జితేంద్ర



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న జితేంద్ర, రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ముఖ్య నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు విద్యార్థుల పేదరికం చదువుకి అడ్డం కాకూడదనే ఉద్దేశంతో తన ఉద్యోగ విరమణ ద్వారా వస్తున్న పెన్షన్‌తో ఏటా ఆరుగురు విద్యార్థులకు సహాయం అందించడానికి ముందుకు రావడం అభినందనీయమని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ మారిశెట్టి జితేంద్ర పేర్కొన్నారు. ఆదివారం స్థానిక లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంపీటీ, పాలిటెక్నిక్ ఇతర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహకారం అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుబ్బల రాంబాబుతో కలసి విద్యార్థులకు చెక్కులు అందజేశారు. జితేంద్ర మాట్లాడుతూ రాంబాబు అందిస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని ఇప్పుడు ఆర్థిక సహకారం పొందిన విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చదువుకుని సహాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. కుటుంబ పేదరికం కారణంగా చదువు ఆగిపోకూడదన్న ముఖ్య ఉద్దేశంతో రాంబాబు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువు మాత్రమే మనిషిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళుతుందని విద్యార్థులు కష్టపడి ఆ స్థాయికి చేరాలని జితేంద్ర ఆకాంక్షించారు. గుబ్బల రాంబాబు మాట్లాడుతూ తనకు వస్తున్న పెన్షన్ ద్వారా ప్రతీ ఏటా 6గురు మెరిట్ విద్యార్థులకు ఈ విధంగా ఆర్థిక సహకారం అందిస్తానని తెలిపారు. బాగా చదువుకునే వారిని ప్రోత్సహించడం ద్వారా మరింతగా వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు తన వంతుగా ఈ ప్రయత్నం ప్రారంభించినట్టు వివరించారు.

సచివాలయ ఉద్యోగులకు తీవ్ర ఒత్తిడి

- సర్వేల పేరుతో వేధింపులు
- వలంటీర్ల పనులన్నీ వారికే
- పెరిగిన పనిభారం, నిరసనలకు దిగుతున్న వైనం



ముగ్గళ్ల గ్రామ సచివాలయం



రఘుదేవపురం గ్రామ సచివాలయం

సీతానగరం: ఉన్న గ్రామంలోనే ప్రజలకు అన్ని సేవలు అందించాలనే తపనతో గ్రామ స్వరాజ్య సాధన దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో గ్రామాల్లో అన్ని సేవలు సకాలంలో అందేవి. జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లకుండానే ప్రజలకు సేవలు అందడంతో వ్యయ ప్రయాసలు తప్పేవి. నేడు కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థనే నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా దేశ చరిత్రలోనే ఎక్కడా ఎన్నడూ లేని విధంగా గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి రాష్ట్రంలో లక్షలాది మంది యువతకు ఉద్యోగవకాశాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేందుకు, పరిపాలన ప్రజల వద్దకే తీసుకొచ్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన సచివాలయ వ్యవస్థను కూటమి సర్కార్ భ్రష్టు పట్టిస్తోంది.

నియోజకవర్గంలో 78 సచివాలయాలు, 648 మంది ఉద్యోగులు

రాజానగరం మండలంలో 34 గ్రామ సచివాలయాలు, 272 మంది సచివాలయ ఉద్యోగులు, సీతానగరం మండలంలో 20 సచివాలయాలు, 160 మంది ఉద్యోగులు, కోరుకొండ మండలంలో 24 సచివాలయాలు, 216 మంది ఉద్యోగులు ఉన్నారు. కూటమి ప్రభుత్వ వేధింపులను తట్టుకోలేక నిరసన కార్యక్రమాలకు దిగుతున్నారు. అధికారులకు వినతిపత్రాలు అందజేసి నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు.

సంబంధం లేని విధుల అప్పగింత

జాబ్‌చార్ట్‌తో సంబంధం లేని విధులు అప్పగిస్తూ హీనంగా చూస్తున్నారని సచివాలయ సిబ్బంది ఉద్యోగులు లోలోన కుమిలిపోతున్నారు. తమ బాధను ఎవరికీ చెప్పుకోలేక మదనపడుతున్నారు. రోజువారీ పనితో పాటు సర్వేలు, సమాచారం సేకరణ పేరుతో ప్రభుత్వం చేస్తున్న ఒత్తిడి కారణంగా సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గతంలో ఎంఎస్‌ఎంఈ సర్వే, పీపీసీ సర్వే, జియో ట్యాగింగ్ వంటి సర్వేల పేరుతో బండ చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంద రోజుల పాలన పూర్తైందని ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించే పని చేయించారు. దీంతో సచివాలయ ఉద్యోగుల్లో అసంతృప్తి జ్వాల రగులుతోంది.

పింఛన్ల పంపిణీతో ఒత్తిడి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఒకటో తేదీ తెల్లవారుజామున వలంటీర్లు ఠంచన్‌గా పింఛన్ అందించారు. నేడు సచివాలయ ఉద్యోగులను తీవ్ర ఒత్తిడి పెట్టి పింఛన్లు పంపిణీ చేయిస్తున్నారు. తెల్లవారు జామునే మహిళా ఉద్యోగులు లక్షల నగదు తీసుకుని పంపిణీ కోసం వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. గ్రామాల్లో అక్కడక్కడా విసిరేసినట్లు ఉండే ఇళ్ల వద్దకు వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు.

జాబ్‌చార్ట్ లేదు .. ప్రమోషన్ చానల్ లేదు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు డిపార్ట్‌మెంట్, సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేయలేదు. ప్రమోషన్ చానల్ ఏర్పాటు లేదు. సరైన జాబ్‌చార్ట్, పని వేళలు లేవు, సెలవులు అమలు లేవు, పబ్లిక్ హాలిడేస్ లేవు. ప్రభుత్వం వీటిపై స్పష్టత ఇవ్వకుండా ఒక మల్టీ పర్పస్ ఉద్యోగిగా వాడుకుంటోందనే ప్రచారం జరుగుతుంది.

ఉద్యోగులకు అవమానం అధికం

కూటమి ప్రభుత్వం పదహారు నెలల పాలనలో స్టిక్కర్లు అంటించడం, కరపత్రాలు పంచమనడంపై సచివాలయ ఉద్యోగులు రగిలిపోతున్నారు. ఇప్పటికే ఉద్యోగులు బహిరంగంగానే నిరసన తెలియజేస్తూ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. నల్ల రిబ్బన్లు ధరించి మండల కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంకా నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయంటున్నారు. గతంలో ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ వలంటీర్లతో స్టిక్కర్లు అంటించడాన్ని కోర్టులో సవాల్ చేసిందని, మరి ఇప్పుడు వలంటీర్లను విధుల్లోకి తీసుకోకపోగా ఉద్యోగులకే స్టిక్కర్లు అంటించే బాధ్యతలు అప్పగించింది. పాఠశాలలకు వెళ్లి టాయిలెట్లు ఫొటోలు తీయమంటున్నారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులపై ఎందుకింతగా ఒత్తిడి తీసుకొస్తున్నారో పాలకులకే ఎరుక. ఈ మధ్య తీవ్ర ఒత్తిడికి లోనై కొంతమంది సెక్రటరీలు అసువులు బాసిన ఘటనలు కూడా ఉన్నాయి.

అధిక పని ఒత్తిడి



కూటమి ప్రభుత్వంలో అధిక పని ఒత్తిడితో సతమతమవుతున్నాం. సమయపాలన లేకుండా పోయింది. పలు సర్వేల పేరులతో టార్గెట్లు ఇచ్చి పని ఒత్తిడి పెంచుతున్నారు. టార్గెట్లు పూర్తి చేయకపోతే షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు. సర్వేల నుంచి విముక్తి కలిగించాలి. ఏ డిపార్ట్‌మెంట్ వారిని ఆ డిపార్ట్‌మెంట్ మాతృశాఖలో విలీనం చేయాలి. సెలవు దినాల్లో పనులు అప్పగించవద్దు

– వరసాల రామదాసు, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్–6, డిజిటల్ అసిస్టెంట్, పాలచర్ల, రాజానగరం మండలం

వాటి నుంచి మమ్మల్ని తప్పించాలి



గతంలో పాఠశాలల్లో టాయిలెట్స్‌ను ఉపాధ్యాయులు ఫొటోలు తీసేవారు. వారు తీవ్ర అభ్యంతరం తెలపడంతో మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత మాకు అప్పగించారు. వాటి నుంచి మమ్మల్ని తప్పించాలి. నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. ప్రమోషన్ చానల్ కల్పించాలి. వేరే పనులకు కాకుండా గత ప్రభుత్వంలో చేసిన విధంగా విధులు నిర్వర్తించేలా చూడాలి

– కె.శుభాకర్, వెల్ఫేర్ అసిస్టెంట్, కొవ్వూరు

వైఎస్సార్ బ్లడ్ బ్యాంక్‌లో జక్కంపూడి రాజా జన్మదిన వేడుకలు



జక్కంపూడి రాజా జన్మదినం సందర్భంగా రక్తదానం చేసిన యువకులు

కంబాలచెరువు: మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా జన్మదిన వేడుకలు దానవాయిపేటలోని వైఎస్సార్, జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ బ్యాంక్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంక్‌లో కేక్ కట్ చేశారు. యువకులు హాజరై రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆకుల శ్యామ్, కొమ్ముల సూర్య, బిక్కిన శ్రీకృష్ణ, సతీష్‌చౌదరి, కోట పవన్, సునీల్ పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు



కాలువలోకి దూసుకెళ్లిన కారును ట్రాక్టరుతో బయిటకు లాగుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట జాతీయ రహదారిపై ఓ కారు ఆదివారం మధ్యాహ్నం కాలువలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ట్రాక్టరు సహాయంతో కారును పైకి లాగారు. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.